క్లుప్తంగా

కొత్తముప్పర్రులో వికసిత్ భారత్ సంకల్పయాత్ర



కొత్తముప్పర్రులో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర

దెందులూరు: కొత్తముప్పర్రులోని తాళ్లగూడెం గ్రామ పంచాయతీలో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర నిర్వహించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను నాయకులకు వివరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ లీగల్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ఐ. రాజశేఖర్, పెదపాడు మండలం బీజేపీ అధ్యక్షుడు శ్రీనివాసరావు అధికారులు, సర్పంచులు ఉన్నారు.

విజేతలకు బహుమతుల ప్రదానం

దెందులూరు: విద్యార్థులు ప్రాథమికస్థాయి నుంచి ప్రణాళిక, క్రమశిక్షణ పట్టుదలతో లక్ష్య సాధనకు కృషి చేయాలని వ్యవసాయ శాఖ జిల్లా అసిస్టెంట్ డైరెక్టర్ సుబ్బారావు అన్నారు. ఆదివారం సోమవరప్పాడులో చల్లపల్లి ఛారిటబుల్ ట్రస్టు డైరెక్టర్ చల్లపల్లి వెంకటేశ్వరరావు, సోమవరప్పాడు పుస్తక పంపిణీ కేంద్రం నిర్వాహకులు, చల్లపల్లి ఛారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా నిర్వహించిన వివిధ పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా విజేతలను అభినందించారు. కార్యక్రమంలో గోపన్నపాలెం ఉన్నత పాఠశాల హెచ్ఎం డాక్టర్ మనోహర్, ట్రస్టు సభ్యులు శ్రీలత, అల్లు వెంకటేశ్వరరావు, కృష్ణ, గ్రంథాలయాధికారి రాజు, గ్రామస్తులున్నారు.

చట్ట సభల్లో మహిళల ప్రాతినిధ్యం పెరగాలి

ఏలూరు (టూటౌన్): చట్ట సభల్లో మహిళా ప్రాతినిధ్యం పెరగాలని విశ్రాంత జడ్జి అడబాల లక్ష్మి అన్నారు. స్థానిక సీపీఐ జిల్లా కార్యాలయం స్ఫూర్తి భవనంలో ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మహిళలు–మహిళా కార్మికుల చట్టాలు అంశంపై ఆదివారం సదస్సును నిర్వహించారు. ఈ సదస్సులో ముఖ్య అతిథిగా పాల్గొన్న అడబాల లక్ష్మి మాట్లాడుతూ ఓటు వజ్రాయుధం అని రాజ్యాంగంలో మహిళలకు సంబంధించిన హక్కులు, భద్రత, సమానత్వం, సాధన కోసం మహిళలు పోరాటాలు చేయాలన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో చట్ట సభల ద్వారానే చట్టాలు రూపొందుతాయన్నారు. చట్టాల అమలు బాధ్యత కార్య నిర్వాహక వ్యవస్థదే అన్నారు. చట్టాల అమలు సక్రమంగా జరగనప్పుడు కోర్టు ద్వారా పరిష్కరించుకునే విధంగా మహిళలు పోరాడాలన్నారు. మహిళలకు గౌరవ ప్రదమైన జీవితం ప్రాథమిక హక్కు అన్నారు. ఈ అవగాహన సదస్సులో ఏపీ మహిళా సమాఖ్య ఏలూరు జిల్లా అధ్యక్షురాలు వరక శ్యామల, కార్యదర్శి మన్నవ యామిని, సహాయ కార్యదర్శి గొర్లి స్వాతి, కార్యనిర్వాహక అధ్యక్షురాలు కొండేటి బేబి, కార్యదర్శి అడ్డగర్ల లక్ష్మీ ఇందిర పాల్గొన్నారు.

పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలి

ఏలూరు (టూటౌన్): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నూతన పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలని ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు బండి వెంకటేశ్వరరావు కోరారు. స్థానిక కోటదిబ్బ సర్వీస్ రిజర్వాయర్ ఒకటి వద్ద ఏఐటీయూసీ అనుబంధ ది జోనల్ మున్సిపల్ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో జాతీయ పెన్షనర్స్ దినోత్సవాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఎంప్లాయీస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి ఎ.అప్పలరాజు, నాయకులు బి.నారాయణరావు, పీవీ రమణ, డి.వెంకటేశ్వరరావు, పెద్దిరాజు,కెలోమీ, సీహెచ్ ప్రసాద్ పాల్గొన్నారు.

కోడిపందేలపై పోలీసుల దాడి

ఏలూరు టౌన్ : ఏలూరు రూరల్ మాదేపల్లి శివారు గురకలపేట ప్రాంతంలో కోడిపందేలపై ఏలూరు రూరల్ పోలీసులు దాడి చేశారు. ఏలూరు రూరల్ ఎస్సై రాజారెడ్డి తమ సిబ్బందితో కోడిపందేలు నిర్వహిస్తున్న వారిపై ఆదివారం దాడి చేశారు. కోడిపందేలు నిర్వహిస్తోన్న ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. కోడిపుంజు, రూ.1,400 నగదు, 270 కోడికత్తులను స్వాధీనం చేసుకున్నారు. వైఎస్సార్ కాలనీకి చెందిన కోడి కత్తులు సరఫరా చేస్తున్న పాలెపు వెంకటేశ్వరరావును అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నారు. కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నామని ఎస్సై రాజారెడ్డి తెలిపారు.

జట్టు ముఠా కార్మికులకు సమగ్ర చట్టం చేయాలి

ఏలూరు (టూటౌన్): అసంఘటిత రంగంలో పనిచేస్తున్న జట్ల ముఠా కార్మికులకు, హమాలీ కార్మికులకు కేంద్ర ప్రభుత్వం సమగ్ర చట్టం చేయాలని సీపీఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య కోరారు. స్థానిక మెయిన్ బజార్లో జలవాణి సెంటర్లో ఏఐటీయూసీ అనుబంధ జట్లు లాగుడు బండ్ల కార్మిక సంఘం జనరల్ బాడీ సమావేశం పుప్పాల కన్నబాబు అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. ఏఐటీయూసీ పతాకాన్ని యూనియన్ గౌరవ అధ్యక్షుడు మారిన వెంకట్రావు ఆవిష్కరించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా కృష్ణ చైతన్య హాజరయ్యారు. సమావేశంలో ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు బండి వెంకటేశ్వరరావు, సంఘం కోశాధికారి పెచ్చెట్టి శ్రీనివాస్ పాల్గొన్నారు.

షష్ఠి ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి



ఉంగుటూరు: విద్యుత్ కాంతుల్లో కైకరం ఆలయం



ఉంగుటూరు: కైకరం షష్ఠి ఉత్సవాల ఏర్పాట్లు

ఉంగుటూరు: కై కరం సుబ్రహ్మణ్యేశ్వర షష్ఠికి ఏర్పాట్లు పూర్తయ్యాయి. సోమవారం నుంచి ఏడు రోజులు ఉత్సవాలు నిర్వహించనున్నారు. రాత్రి సమయాల్లో సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. సోమవారం సుబ్రహ్మణ్య షష్ఠి సందర్భంగా పదివేల మంది భక్తులకు అన్న సమారాధన నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. తహసీల్దారు వెంకటరమణ, ఆలయ వంసపారంపర్య ధర్మకర్తల కమిటీ సభ్యుడు పుప్పాల గోపి, కె. శ్రీనివాసరావు పర్యవేక్షణలో శానం బాబ్జి ఆధ్వర్యంలో షష్ఠి ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. రాష్ట్రంలోని అనేక ప్రాంతాల నుంచి వచ్చిన వారు వివిధ రకాల స్టాల్స్ ఇప్పటికే ఏర్పాట్లు చేశారు. అర్ధరాత్రి ఒంటిగంట సమయంలో కల్యాణం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఆలయం ప్రాంతమంతా విద్యుద్దీపాలతో అలంకరించారు. బాదంపూడి దత్త బాలసుబ్రహ్మణ్య స్వామి ఆలయంలో షష్ఠి ఉత్సవాల సందర్భంగా సోమవారం హోమాలు, అభిషేకాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. చేబ్రోలు, యర్రమళ్ల ఆలయాల్లో షష్ఠి ఉత్సవాల నిర్వహణకు ఏర్పాట్లు చేశారు.

నేటి నుంచి షష్ఠి ఉత్సవాలు

భీమడోలు: గుండుగొలనులో స్వయంభూ వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణేశ్వర స్వామి ఆలయంలో ఈనెల 18 సోమవారం నుంచి 20వ తేదీ వరకు 62వ ఏటా షష్ఠి మహోత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు ఆలయ ఉత్సవ కమిటీ ఏర్పాట్లు చేసింది. ఇక్కడ కొలువైన స్వామి వారిని దర్శించుకుంటే సమస్యలు పరిష్కారమవుతాయని భక్తులు ప్రగాఢ విశ్వాసం. దీనితో ప్రతి ఏటా షష్ఠి వేడుకలు వైభవంగా నిర్వహిస్తారు. ఆలయ ఉత్సవ కమిటీ అధ్యక్షుడు బర్ల రమణమూర్తి ఆధ్వర్యంలో స్వామి వారికి పూజలు నిర్వహించనున్నారు. ఆలయంలో సంప్రదాయబద్ధంగా పూజలు చేసేందుకు పరిసర గ్రామాలకు చెందిన భక్తులు తరలి రానున్నందున వారికి ఎటువంటి అసౌకర్యం కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేసారు. ఆలయంలో విఘ్నేశ్వర కలశ స్థాపన శ్రీస్వామి వారికి పంచామృత ఫలరసన అభిషేకాలతో స్వామికి విశేష పూజలు చేయనున్నారు.



భీమడోలు: గుండుగొలనులోని సుబ్రహ్మణ్యేశ్వర స్వామి



ఉంగుటూరు: కైకరంలో సుబ్రహ్మణ్యేశ్వరస్వామి

వైభవంగా ఆలయాల్లో ధనుర్మాస పూజలు

భీమడోలు: దేవాలయాల్లో ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా రెండవరోజైన ఆదివారం ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. మండలంలోని గుండుగొలను, భీమడోలు, పూళ్ల తదితర గ్రామాల్లో వేంకటేశ్వర స్వామి వార్లు, సీతారామ స్వామ వార్ల ఆలయాల్లో భక్తులు స్వామి వార్లను దర్శించుకునేందుకు బారులు తీరారు. వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని ఈనెల 23న శనివారం తెల్లవారుజామున స్వామి వారిని భక్తులు ఉత్తర ద్వారం ద్వారా దర్శనం చేసుకునేలా ఏర్పాట్లు చేసారు. దేవదాయ ధర్మదాయశాఖ పరిధిలో గుండుగొలనులోని ప్రసిద్ధిగాంచిన సీతారామస్వామి ఆలయంలో ఆదివారం సంక్రాంతి శుభ ఘడియలు ప్రారంభం కావడంతో ఆలయంలో స్వామి వార్లకు విశేష పూజలు కనుల వేడుకగా నిర్వహించారు. ఆలయ ఫౌండర్ ట్రస్టీ కొండ గంగారాజ్‌కుమార్ ఆధ్వర్యంలో పూజారి సుధీరాచార్యులు ఆలయంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు చేసారు. స్వామి వారిని విశేషంగా అలంకరించి ముస్తాబు చేసారు. పరిసర గ్రామాలకు చెందిన భక్తులు స్వామి వారిని దర్శించుకుని పూజలు చేసారు.

గుండుగొలనులో

గుండుగొలనులోని దేవాదాయ ధర్మదాయశాఖకు చెందిన గుండుగొలనులో వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం స్వామి వారి జన్మ నక్షత్రాన్ని పురస్కరించుకుని ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు ఘనంగా నిర్వహించారు. ఆలయ పూజారులు మంగపతి ఆచార్యులు, సాయి ఆచార్యులు ఆధ్వర్యంలో స్వామి వారికి శాస్త్రోక్తంగా విశేష పూజలు చేసారు. ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా నెల రోజుల పాటు ప్రత్యేక అలంకరణలు, విశేష పూజలు చేస్తామని, భక్తులకు అసౌకర్యం కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నామని నిర్వాహకులు తెలిపారు. స్వామి వారిని భక్తులు దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు వగ్వాల మీనాకుమారి అచ్యుతరామారావు, పెద్దలు నీలంశెట్టి రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.



గుండుగొలనులో విశేష పూజలందుకుంటున్న సీతారామస్వామి



గుండుగొలనులో వేంకటేశ్వర స్వామి

విష్ణు ఆలయంలో విశేష పూజలు

దెందులూరు: ధనుర్మాసం ప్రారంభోత్సవం పురస్కరించుకుని ఆదివారం గ్రామగ్రామాన విష్ణు ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. ధనుర్మాసాన్ని పురస్కరించుకుని భక్తులు నవనీతహారతి ఇచ్చారు. స్వామివారి తీర్థప్రసాదాలను ఆలయ అర్చకులు భక్తులకు అందజేశారు.

డాక్టర్ గోపి మృతి



డాక్టర్ గోపి ఆదిరెడ్డి

ఉంగుటూరు: నాలుగు దశాబ్దాల పాటు ఉంగుటూరు మండలంలో వైద్య సేవలు అందించిన డాక్టర్ గోపి ఆదిరెడ్డి(87) హైదరాబాదు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం మృతి చెందారు. ఆయన ఉంగుటూరు ప్రభుత్వ ఆయుర్వేద ఆసుపత్రిలో వైద్యుడిగా, చేబ్రోలు ప్రభుత్వ ఆసుపత్రి వైద్యుడిగా పనిచేస్తూ సొంతంగా ఆసుపత్రి చేబ్రోలులో నిర్వహించారు. ఆ సమయంలో చేబ్రోలు ఉంగుటూరు, నారాయణపురం. పరిసర ప్రాంతాల్లోని అనే గ్రామాల ప్రజలకు ఆయన వైద్య సేవలందించారు. ఆయన ప్రభుత్వ వైద్యుడిగా ఉద్యోగ విరమణ అనంతరం ఉచిత వైద్య శిబిరాలు, సేవా కార్యక్రమాలు నిర్వహించారు. నారాయణపురం కళాశాల అభివృద్ధికి డాక్టర్ ఆదిరెడ్డి సహకారం అందించారు.

కరుణించమ్మా.. రాట్నాలమ్మ

పెదవేగి : కరుణించమ్మ...రాట్నాలమ్మ అంటూ వివిధ ప్రాంతాల నుంచి విచ్చేసిన భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెదవేగి మండలం రాట్నాలకుంటలో వేంచేసిన రాట్నాలమ్మకు ఆదివారం భక్తులు పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. ఈ వారం అమ్మవారి ఆలయానికి రూ.59,164 ఆదాయం లభించిందని దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఎన్ సతీష్‌కుమార్ చెప్పారు.

రాష్ట్ర గౌడ సంఘ కార్యవర్గం రద్దు

పెదవేగి : రాష్ట్ర గౌడ సంఘ కార్యవర్గాన్ని రద్దు చేస్తూ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకునేందుకు అడహక్ కమిటీని నియమించారు. పెదవేగిలో నిర్వహించిన సమావేశంలో వివిధ జిల్లాలకు చెందిన గౌడ సంఘం నేతలు పాల్గొన్నారు. ప్రస్తుతం ఏలూరుకు చెందిన చలమోలు అశోక్ గౌడ్ తాత్కాలిక అధ్యక్షుడిగా ఉన్న గౌడ సంఘాన్ని రాష్ట్ర గౌడ సంఘ ఛైర్మన్ జోగి రమేష్ ఆదేశాల మేరకు రద్దు చేస్తున్నట్లు ప్రతినిధులు పేర్కొన్నారు. నూతన కమిటీని ఎన్నుకునేంత వరకు సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు చలపాటి వేంకటేశ్వరరావు అడహక్ కమిటీకి కన్వీనర్‌గా వ్యవహరిస్తారని ప్రతినిధులు ప్రకటించారు. కో కన్వీనర్లుగా మట్టా వీరబాబు, తాతా కృష్ణారావు, మట్టా లక్ష్మి, అనుమోలు ఏడుకొండలు, దాసరి ప్రసాద్, మట్టా రామాశంకర్ వ్యవహరిస్తారని కమిటీ పేర్కొన్నారు.

అభివృద్ధి, సంక్షేమానికి సమాన ప్రాధాన్యం

- ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి
- కోలాహలంగా ప్రజా ఆశీర్వాద పాదయాత్ర

పెదవేగి : అభివృద్ధి, సంక్షేమానికి సమాన ప్రాధాన్యతనిస్తూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆదర్శవంతమైన పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి అన్నారు. ఎసైన్డ్ భూమి గల సన్న చిన్నకారు రైతులకు సర్వ భూ హక్కులు కల్పిస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకున్న నిర్ణయం రాష్ట్ర చరిత్రలో సువర్ణాధ్యాయంగా నిలుస్తుందని ఆయన అన్నారు. నియోజకవర్గంలో ఆయన ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా ఆశీర్వాద యాత్ర 4వ రోజు కోలాహలంగా కొనసాగింది. ఆదివారం మధ్యాహ్నం నుంచి రాత్రి వరకు బాపిరాజుగూడెం నుంచి కొండలరావుపాలెం వరకూ పార్టీ శ్రేణులతో రహదారులు కిటకిటలాడాయి. మహిళలు హారతులు, పూలతో నాయకులకు ఘన స్వాగతం పలికారు. పలు అభివృద్ధి కార్యక్రమాలను జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీతో కలిసి, ఎమ్మెల్యే, ఇతర నాయకులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి మాట్లాడుతూ దెందులూరు నియోజకవర్గంలో 13,800 మంది పేదవారికి ఇళ్ల స్థలాలు అందించిందించామని గుర్తుచేశారు. రూ.500 కోట్లతో రోడ్లను అభివృద్ధి చేశామన్నారు. వచ్చే ఎన్నికల్లో 50 వేల మెజార్టీతో విజయం సాధించి, జగనన్నకు బహుమతిగా ఇవ్వాలని కోరారు. దెందులూరు నియోజకవర్గంలో రూ.2,800 కోట్లతో అభివృద్ధి, సంక్షేమం చేసి చూపించామని తెలిపారు. బాపిరాజుగూడెంలో ప్రత్యేక దృష్టి సారించి గ్రామంలో రూ.24.80 కోట్లతో పలు అభివృద్ధి పనులు పూర్తి చేశామన్నారు. గ్రామంలో రెండు బడులను కార్పొరేట్ బడులకు దీటుగా రూ.52 లక్షలతో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దామని తెలిపారు.

రాష్ట్ర చరిత్రలో సువర్ణాధ్యాయం

సీఎం జగన్ ఆశీస్సులతో బాపిరాజుగూడెంలో మొదటి విడతగా 250 ఎకరాలకు సంబంధించిన అస్సైన్డ్ భూముల రైతులు 244 మందికి లబ్ధి చేకూర్చుతూ పట్టాలు అందించారు. దీంతో భూములపై పూర్తి హక్కు రైతులకు వస్తుంది. గ్రామంలో 175 ఎకరాల సమస్యను సీఎం దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు. జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ మాట్లాడుతూ సీఎం జగన్ పాలనలో పేదలకు ఎంతో మేలు చేకూరిందని, సీఎం స్ఫూర్తితో 100 రోజులపాటు ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి చేస్తున్న పాదయాత్రకు ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందన్నారు.ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ అప్పన కనక దుర్గ ప్రసాద్, జెడ్పీ వైస్ చైర్మన్ పెనుమాల విజయ్‌బాబు, టీటీడీ ట్రస్ట్‌బోర్డు మెంబర్ నెరుసు నాగసత్యం, ఏపీ ఆయిల్ ఫెడ్ మాజీ రైతు కమిటీ చైర్మన్ కొఠారు రామచంద్ర రావు, వైఎస్సార్ సీపీ జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు ఘంటా ప్రసాద్, జెడ్పీటీసీలు, ఎంపీపీలు, వైస్ ఎంపీపీలు, ఎంపీటీసీలు, సర్పంచ్ లు, సొసైటీ అధ్యక్షులు, పార్టీ అధ్యక్షులు, సచివాలయ కన్వీనర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు



బాపిరాజుగూడెం ప్రజా ఆశీర్వాద యాత్రలో ప్రజలకు అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే కొఠారు



రైతులకు భూముల రిజిస్ట్రేషన్ పత్రాలు అందిస్తున్న ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి

జోరుగా వరి నారుమళ్లు



దుద్దేపూడిలో వరి నారుమళ్లను పరిశీలిస్తున్న ఏవో ఎస్‌పీబీ ఉషారాణి

భీమడోలు: మండలంలో రైతులు దాళ్వా వరి నారుమళ్ల జోరుగా వేస్తున్నారు. మండల వ్యాప్తంగా 13,150 ఎకరాల్లో సాగు ప్రారంభించాల్సి ఉండగా ఇప్పటి వరకు 7,600 ఎకరాల్లో సాగుకు చెందిన వరి నారుమడులు వేసారు. మిగిలిన రైతాంగం వారం రోజుల్లో నారుమళ్ల పూర్తి చేసుకునేలా సంబంధిత అధికారులు చర్యలు చేపట్టారు. నారుళ్లను ఏవో ఎస్‌పీబీ ఉషారాణి పరిశీలించి రైతులకు పలు సూచనలందిస్తున్నారు. వాస్తవానికి ఇప్పటికే నారుమళ్ల ప్రక్రియ 90 శాతానికి పైగా పూర్తి కావాల్సి ఉండగా మిచాంగ్ తుపాను ప్రభావంతో రైతులు సార్వా పంటను ఒప్పిడి చేసుకునే పనిలో నిమగ్నమయ్యారు. ప్రభుత్వం తీసుకున్న చర్యలు వల్ల రైతులు ఇప్పటికే 90శాతానికి పైగా సార్వా ధాన్యాన్ని మిల్లలకు తరలించి ఉపిరి పీల్చుకున్నారు. దీనితో పాటు వారికి ఖాతాల్లో వారం రోజుల లోపు నగదు జమ అవుతుంది. ఇటీవల ప్రభుత్వం తుపాను వల్ల దెబ్బతిన్న పంటకు నష్టపరిహారం అందించేందుకు వ్యవసాయ, రెవెన్యూ శాఖల సిబ్బందిని సర్వే చేయాలని ఆదేశించిన నేపథ్యంలో ఇప్పటి వరకు 98శాతానికి పైగా సర్వే చేసి నష్టం అంచనాలను సిద్ధం చేసారు. పంట నష్టపోయిన రైతుల వివరాలను తెలియజేస్తూ ఆర్‌బీకేల వద్ద జాబితాలను ఏర్పాటు చేసారు. రైతులు అనుమానాలు ఉన్నట్లయితే సంబంధిత వీఏఏలను సంప్రదించాలని అధికారులు కోరారు. మండల పరిధిలో 312 మంది రైతులకు చెందిన 520 ఎకరాల సార్వా పంట దెబ్బతిన్నట్లు ఉన్నతాధికారులకు అందించిన నివేదించారు. రైతుకు చెందిన దెబ్బతిన్న పంట విస్తీర్ణం తదితర వివరాలను ఆ బోర్డులో ఉంచారు. రైతులు ఆందోళన చెందనవసరం లేదన్నారు. ఇంకా నష్టపోయిన రైతులున్నట్లయితే వారి వివరాలను తమ సిబ్బంది దృష్టికి తీసుకుని రావాలని రైతులను కోరారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలోని ఇంకా కొన్ని గ్రామాల్లో పంట నష్టం వివరాల నమోదు కార్యక్రమం పూర్తి కావస్తుందన్నారు.

పదో తరగతి విద్యార్థుల సమ్మేళనం



సత్యవోలు ఉన్నత పాఠశాలలో 1988-89 విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

దెందులూరు: గతాన్ని మరిచిపోకుండా స్నేహితులంతా మూడు దశాబ్దాలు తరువాత కలవడం మరువలేని విషయమని జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ అన్నారు. ఆదివారం సత్యవోలులో జెడ్పీ హైస్కూల్లో 1988–89 సంవత్సరం పదో తరగతి బ్యాచ్ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ పాల్గొన్నారు. తొలుత విద్యార్థులంతా వారి కుటుంబ సభ్యులను, వారు చేస్తున్న వృత్తులను వివరించి గత స్మృతులను నెమరవేరుకున్నారు. తమకు భవిష్యత్తునిచ్చిన పాఠశాల అభివృద్ధికి అందరూ కలిసి తమ వంతు చేయూత అందిస్తామని పూర్వవిద్యార్థులు అన్నారు.

'ఆడుదాం ఆంధ్ర' విజయవంతం చేయాలి



యువతకు క్రికెట్ కిట్లు పంపిణీ చేస్తున్న వైఎస్సార్ సీపీ దెందులూరు మండల అధ్యక్షుడు కామిరెడ్డి నాని

దెందులూరు: ఆడుదాం ఆంధ్ర కార్యక్రమాన్ని యువత విజయవంతం చేయాలని శ్రీరామవరం సర్పంచ్, వైఎస్సార్ సీపీ దెందులూరు మండల అధ్యక్షుడు కామిరెడ్డి నాని అన్నారు. ఆదివారం శ్రీరామవరంలో యువతకు క్రికెట్లను ఆయన అందజేశారు. ఈ సందర్భంగా కామిరెడ్డి నాని మాట్లాడుతూ గ్రామాల్లోని యువతలో ప్రతిభను వెలికి తీయడానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆడుదాం ఆంధ్రాలో క్రీడాపోటీలు నిర్వహిస్తున్నారని అన్నారు. యువత తమ ప్రతిభాపాటవాలను చాటుకోవడానికి ఇది ఒక అవకాశమని ఆయన అన్నారు. క్రీడాకారులు వలంటీర్లు, గ్రామ సచివాలయాల ద్వారా రిజిస్ట్రేషన్లు చేయించుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.

కోడిపందేలపై దాడి

దెందులూరు: దెందులూరు గ్రామంలో ఆదివారం కోడిపందేలు నిర్వహిస్తున్న వారిని దెందులూరు ఇన్‌ఛార్జి ఎస్సై చల్లా కృష్ణ, సిబ్బంది దాడిచేశారు. ఈ దాడిలో ఐదు గురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.1,100 నగదు, కోడిపుంజులు, రెండు కోడి కత్తు లు, ఐదు సెల్‌ఫోన్లు స్వాధీనంచేసుకున్నామన్నారు. వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.